# దక్షిణాపథ వార్తావని

జూన్ 2025

సంపుటి - 02
సంచిక - 06


## సరస్వతీ నది పుష్కరాలు

భారతదేశం ఎన్నో పవిత్ర నదులకు పుట్టినిల్లు. పంచభూతాల్లో ఒకటైన నీటిని మన దేశంలో పరమ పవిత్రంగా భావిస్తాం. అందుకే ఆ నీరు ప్రవహించే నదులను కూడా పూజిస్తాం.. వాటిల్లో స్నానాలు చేస్తే పాపాలు తొలగిపోతాయని, సమస్యలు తీరుతాయని నమ్ముతాం. మన దేశంలో చాలా నదులకు పురాణాల్లో అత్యంత ప్రాముఖ్యత ఉంది. వాటిల్లో ఒకటి సరస్వతి నది. రుగ్వేదంలో దీని గురించిన ప్రస్తావన ఉంది. సరస్వతి నది గురించి రుగ్వేదంలో "అంబితమే, నదీతమే, దేవీతమే" (ఉత్తమ తల్లి, ఉత్తమ నది, ఉత్తమ దేవత)గా కీర్తించారు. సరస్వతి నది ఒకప్పుడు భారతదేశంలోని వాయవ్య ప్రాంతంలో ప్రవహించిందని చెబుతారు.

సరస్వతీ నది హిమాలయాల నుంచి ప్రారంభమై...భారతదేశంలోని అనేక రాష్ట్రాల గుండా ప్రవహించి, చివరకు అరేబియా సముద్రంలో కలుస్తుందని పురాతన గ్రంథాలు, భూగర్భ శాస్త్రవేత్తల అధ్యయనాలు సూచిస్తున్నాయి. రుగ్వేదంలో సరస్వతి నది యమునా, సట్లెజ్ నదుల మధ్య ప్రవహించినట్లు పేర్కొనబడింది. దీని ఆధారంగా.. సరస్వతీ నదిని ఆధునిక కాలంలో గగ్గర్-హక్రా నది వ్యవస్థగా గుర్తించారు. ఈ నది హిమాచల్ ప్రదేశ్‌లోని శివాలిక్ కొండల నుంచి ప్రారంభమై, పంజాబ్, హర్యానా, రాజస్తాన్ రాష్ట్రాల గుండా ప్రవహించి,.. గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్ వద్ద సముద్రంలో కలిసినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ నది మనకు కనిపిస్తుందా అంటే లేదనే చెప్పాలి. సుమారు 4000-5000 సంవత్సరాల క్రితం చోటు చేసుకున్న భౌగోళిక, వాతావరణ మార్పుల వల్ల ఈ నది ఎడారిలో, తన ఆనవాళ్లను వదిలి అదృశ్యమైందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం, సరస్వతీ నది భూగర్భంలో ప్రవహిస్తుందని, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉపరితలంపై కనిపిస్తుందని నమ్మకం. ఉత్తరాఖండ్‌లోని మన గ్రామం (మానా విలేజ్) సమీపంలో, బదరీనాథ్ వద్ద అలకనంద నదితో కలిసే సరస్వతీ నదిని ఒక ఉపనదిగా గుర్తిస్తారు. దీని ప్రకారం, సరస్వతీ నది హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్తాన్, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో చారిత్రక సంబంధం కలిగి ఉంది.

సరస్వతీ నది ఆరంభం గురించి ప్రధానంగా రెండు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వీటిల్లో ఒకటి పురాతనమైనది కాగా, మరొకటి శాస్త్రీయమైనది. పురాణాల ప్రకారం చూసుకుంటే, సరస్వతీ నది బ్రహ్మదేవుని కమండలం నుంచి ఉద్భవించి, హిమాలయాల్లోని ప్లక్ష వృక్షం వద్ద ప్రారంభమైందని చెబుతారు. అలానే శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం చూసుకుంటే, సరస్వతి నది హిమాచల్ ప్రదేశ్‌లోని శివాలిక్ కొండల్లోని హర్-కీ-దూన్ హిమానీనదం (గ్లేసియర్) నుంచి ఉద్భవించిందని కొందరు



చెబుతుండగా, గర్వాల్ ప్రాంతంలోని బందర్‌పూంచ్ మాసిఫ్ వద్ద ప్రారంభమైందని మరొక అభిప్రాయం ఉంది.

ఈ నది సట్లెజ్, యమునా నదులతో సంబంధం కలిగి ఉండేదని, తర్వాత భూకంపాల వల్ల దాని మార్గం మారిపోయిందని భూగర్భ శాస్త్రవేత్తలు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని మన గ్రామంలో సరస్వతీ నది ఉపరితలంపై కనిపించి, అలకనందలో కలుస్తుంది. కనుక మానా గ్రామం సరస్వతి నది ఆధునిక ఆరంభ స్థానంగా పరిగణిస్తున్నారు.

సరస్వతీ నది ఒకప్పుడు హరప్పా నాగరికతకు జీవనాధారంగా ఉండేదని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనాలు సూచిస్తున్నాయి. నాటి ప్రజలు ఈ నదిని జ్ఞాన దేవతగా పూజించారు. సరస్వతి నది పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మిక శుద్ధిని, మోక్షాన్ని అందిస్తాయని నమ్మకం. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి ఈ నదిలో పవిత్ర స్నానం ఆచరిస్తారు.

మిగతా నదుల మాదిరే 12 సంవత్సరాలకు ఒకసారి సరస్వతీ నది పుష్కరాలు వస్తాయి. ఇది బృహస్పతి (గురు గ్రహం) మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు జరుగుతుంది. ఈ సారి ఈ సంవత్సరం మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరిగినాయి.

మన తెలంగాణా రాష్ట్రంలో కూడా కాళేశ్వర క్షేత్రం వద్ద ప్రవహించే గోదావరీ నదిలో అంతర్లీనంగా సరస్వతీ నదీ ప్రవహిస్తూ ఉన్నదనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. గోదావరి, ప్రాణహిత, అంతర్లీనంగా సరస్వతి నదుల త్రివేణీ సంగమ క్షేత్రం, కాళేశ్వరం. సరస్వతి నదీ పుష్కరాలు ఈ క్షేత్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ రాష్ట్రాల నుండి భక్తులు లక్షలాదిగా వచ్చి పుణ్య స్నానాలు ఆచరించి తరించారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5)



ప్రపంచ పర్యావరణ దినోత్సవంను ప్రతి సంవత్సరం జూన్ 5 తేదిన జరుపుకుంటున్నాము. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవమును జూన్ 5 తేదిన విభిన్న రీతులలో ప్రపంచ వ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్నారు. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రపంచ అవగాహనను పెంచడానికి ఈ రోజున కొన్ని చర్యలు చేపడతారు. ఈ భూమి మనుగడకు పర్యావరణం ఎంతో ముఖ్యం. అభివృద్ధి పేరుతో పర్యావరణానికి ఎన్నో విధాలుగా తూట్లు పొడుస్తున్నాం. మితిమీరిన టెక్నాలజీ వినియోగం ప్రకృతికి చేటు తెస్తోంది. నేడు మానవుడు తన మేధో సంపత్తితో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ప్రపంచవ్యాప్తంగా వలు పరిశ్రమలను నెలకొల్పుతున్నాడు. ఈ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో కోలుకోలేనంతగా వాతావరణం కలుషితమై పీల్చే గాలి, త్రాగే నీరు, తినే ఆహారం.. అన్నీ కలుషితమవుతున్నాయి. మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి ప్రసాదించిన వనరులను అవసరానికి మించి వాడుకుంటున్నాడు. అంతేగాకుండా, మానవుడు తన వేగవంతమైన జీవితంలో వాహన వేగం పెంచుతూ, ఇంధన కొరతకు కారణమవుతున్నాడు. కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి పెరగడం వల్ల క్రమంగా భూమండలం వేడెక్కుతోంది. అడవులు, జల వనరులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. ఈ రకంగా, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణమవుతోంది. ఈ కాలుష్యం వల్ల మనకు ఎన్నో రకాల జబ్బులు కూడా వస్తాయి.

వాతావరణం చక్కగా పరిశుభ్రంగా వుంచటానికి , వాతావరణంలో కాలుష్యం పెరగ కుండా చూసుకొవలసిన బాధ్యత మనపై కూడా వుంది. మన ఇల్లే వైకుంఠం, మనవాకిలే కైలాసం అనుకొని మన ఇంటిలోని చెత్త చెదారం పక్కవారి వాకిట్లోకి వూడ్చేసి ఏమీ ఎరగనట్లు వుండడం సబబుకాదు. భవనాల నిర్మాణం కోసం చెట్లు కొట్టేస్తారు, రోడ్డు వెడల్పు చేయడం కోసం చెట్లు కొట్టేస్తారు, కరెంట్ తీగలకి అడ్డం వస్తున్నాయని చెట్లు కొట్టేస్తారు. తాజాగాలి, చల్లటి నీడ మనకి, పక్షులకి కూడా కరువై పోతున్నది. మనకి అవసరం లేదు అనుకోగానే ఎక్కడపడితే అక్కడ ఆవస్తువును పారవేయడం , అరటి పండు తొక్కలు, కాగితాలు, ప్లాస్టిక్ సంచులు రోడ్ల మీద విహారం చేస్తూ వుంటాయి. ఇంట్లో వున్నవాళ్ళు ఈ ఇల్లు మనది దీన్ని శుభ్రంగా వుంచాలి అనుకోవాలి. బడికి వెడితే ఈబడి మనది దీన్నిశుభ్రంగా వుంచాలనుకోవాలి. పార్క్ కు వెడితే ఈపార్క్ లో మనం రోజూ ఆడుకొంటాము, దీన్నిశుభ్రంగా వుంచాలి అనుకొవాలి, ఆఫీసుకు వెళ్ళినా, సినిమా హాలుకు వెళ్ళినా, రైల్ ఎక్కినా, గుడికి వెళ్ళినా అదే భావంతోవుండి, మనపిల్లలకి అదే నేర్పించాలి.

మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు. గాలి, నీరు, నిప్పు, నేల, అంబరం, వనం లేకపోతే ప్రకృతే లేదు. మన దేశంలో అడవులు, అడవులతోబాటు వన్యప్రాణులు, సెలయేళ్ళు. ముఖ్యంగా మన దేశంలోని అడవులలో వివిధ రకాల జంతువులు, పక్షులు ఉన్నాయని పర్యావరణ శాస్త్రం చెపుతోంది. వీటిగురించి తెలుసుకోవాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మనిషికి వన్యప్రాణులతో చాలా దగ్గరి సంబంధం ఉంది. వన్యప్రాణుల ద్వారా పర్యావరణం పరిరక్షింపబడిన కారణంగా మనిషి ఆర్థిక వృద్ధి జరిగింది.

వృక్షో రక్షతి రక్షిత: ప్రస్తుతం పర్యావరణం అతలాకుతలమౌతోంది. అడవులు అత్యధికంగా ఉన్న మన దేశంలోనే అడవులను నరికివేస్తున్నారు. అందులోనున్న కలపను తమ అవసరాలకు అనుగుణంగా వాడుకుంటున్నారు. దీంతో అడవులు తరగిపోతున్నాయి. తరిగే అడవులతోపాటు వన్యప్రాణుల సంఖ్యకూడా అంతరించిపోతోంది. పర్యావరణంలో వస్తున్న మార్పులకారణంగా సరైన సమయానికి వర్షాలు రావడం లేదు. వర్షాలు కురవక పోవడంతో సరైన పంటలు చేతికి అందడం లేదు. ప్రకృతి పరంగా వచ్చిన మార్పుల కారణంగా పర్యావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో ప్రకృతి పరంగా లభించే నీటిని ప్రస్తుతం డబ్బులిచ్చి కొనుక్కునే దుస్థితికి మానవుడే ప్రధానమైన కారణం. రోజురోజుకు పరిస్థితి చాలా భయంకరంగా మారిపోతోంది. అడవులున్న చోట నేడు ఇండ్లుంటున్నాయి. మానవ స్వార్థం కారణంగా ఇలా జరుగుతోంది. చెట్లను నరికిన తర్వాత మళ్ళీ మొక్కలను నాటాలనే ఆలోచన నేటి మానవాళికి లేకపోవడమే ప్రకృతి వైపరీత్యాలకు కారణంగా మారుతోంది. ప్రతి ఒక్కరుకూడా ఇంటి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని, ఇంటి చుట్టుపక్కల ఉండే వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటి వాటి పెంపకం బాధ్యతను కూడా తీసుకోవాలి. దీంతో ఇంట్లో మంచి వాతావరణం నెలకొంటుంది. వేడి, దుమ్ము, ధూళినుంచి కాపాడుకోగలుగుతాము. అలాగే ఇంట్లో మొక్కలు, చెట్లు ఉంటే వాటిపై వచ్చి వాలేందుకు పక్షులుకూడా వస్తాయి. ఇలా పక్షులకు పరోక్షంగా ఆశ్రయమిచ్చినవారమూ అవుతాము. పర్యావరణ పరిరక్షణలో మనమూ భాగస్వాములమవుదాము.

## ఛత్రపతి శివాజీ మాహారాజ్ పట్టాభిషేకం (జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి, జూన్ 9)



గడిచిన వెయ్యి సంవత్సరాల నుండి ఇస్లాం భారతదేశాన్ని చిన్నాభిన్నం చేసేందుకు చాలా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నది. ఆ ప్రయత్నాలను త్రిప్పి కొట్టేందుకు అనేక మంది అనేక రకాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. మొగలుల కాలంలో ఇస్లాం దూరాక్రమణ పరాకాష్టకు చేరుకున్నది. ఆ సమయంలో హిందూ సమాజం నుంచి చాలా తీవ్రమైన ప్రతిఘటన జరిగింది. ఆ ప్రతిఘటన చేసినవారిలో మహారాణాప్రతాప్ అగ్రగణ్యుడు. ఆ తదుపరి ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసిన పోరాటం చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతోలిఖించదగినది. శివాజీ, రాణాప్రతాప్ కంటే పూర్వం పోరాటానికి సజీవ ఉదాహరణ విజయనగర సామ్రాజ్యం. విజయనగర సామ్రాజ్య నిర్మాణం సమయంలో విద్యారణ్యులవారు హిందూ రాజ్యం అని అన్నారు. శివాజీ దాని ప్రేరణతోనే హైందవీ స్వరాజ్యం ఏకైక లక్ష్యంగా సైన్యం ముందు, ప్రజల ముందు ఉంచాడు. ఆ లక్ష్యమే శివాజీని విజయ పథం వైపు నడిపించటమేకాక స్వాతంత్రపోరాటంకి కూడా ప్రేరణగా నిలిచింది. ఆ దిశలో పోరాటం చేసిన శివాజీ 1674 సంవత్సరం జూన్ ఆరో తేదీన అనగా ఆనంద నామ సంవత్సరం జేష్ఠ శుద్ధ త్రయోదశి గురువారంనాడు ఒక క్షత్రియ కుల వతంస సింహాసనాధీశ్వర మహారాజ ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకొని అష్ట ప్రధానులతో ధర్మ పాలన చేశాడు. ఇప్పుడున్న కేంద్రప్రభుత్వానికి మార్గదర్శకం ఆనాటి పాలనయే.

ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మించే నాటికీ దక్కన్ లో ఉన్న శక్తి వంతమైన బహుమనీ రాజ్యం మూడు ముక్కలైంది. అహ్మద్ నగరంలో నిజాం షాహీ, గోల్కొండలో కుతుబ్ షాహీ, బీజాపూర్లో ఆదిల్షాహి రాజ్యాలు ఉండేవి. శివాజీ తండ్రి అహ్మద్ నగర్ నవాబు దగ్గర జాగీర్దార్ గా, సైన్యాధిపతిగా ఉండేవాడు. ఢిల్లీలోని మొగలాయిలు విశృంఖలంగా హిందువుల మీద, హిందూ ధర్మం మీద దాడి చేస్తుండేవారు. దేశమంతటా హిందువుల పరిస్థితి కడు దయనీయంగా ఉండేది ఆ పరిస్థితుల్లో మార్పు తీసుకుని వచ్చి అందరిలో ఒక విశ్వాసాన్ని నిర్మాణం చేసిన వారు శివాజీ. ఆ కాలంలో ఒక ప్రక్క శివాజీ, ఇంకొక ప్రక్క గురుగోవింద్ సింగ్, మరోప్రక్క ఛత్రసాల్ పోరాటం చేసారు.

పరాభవానికి లోనైన మనస్సు, విజిగీషీ ప్రవృత్తిగల మనస్సు రెండిటి మధ్య అంతరం ఉంది. విజిగీషీ ప్రవృత్తి, ప్రతికూలతలను లెక్కపెట్టదు. శివాజీ అన్ని రకాల పరిస్థితులను అర్థం చేసుకుని దానికి తగినట్టుగా వ్యవహరించేవాడు. కూటనీతికి, కూటనీతితోనే సమాధానం చెప్పేవాడు. అందుకే శత్రువుతో ఏ సమయంలో ఎక్కడ తలపడాలో వ్యూహం రచించుకొని దెబ్బకొట్టేవాడు. తన సేనలు ఆత్మవిశ్వాసం తో ఉండటం అత్యంత అవశ్యకమన్న విషయాన్ని గుర్తించిన శివాజీ, తగిన వ్యూహాలు అమలు చేసేవారు.


శివాజీ యుద్ధనీతి కారణంగా, ఢిల్లీ లోని మొగల్ సామ్రాజ్యం బలహీనమైంది. కాస్త నిలద్రొక్కుకొనే వ్యవధి లేకుండా ఆంగ్లేయులు భారత్ లో ప్రవేశించారు. శివాజీ ఆంగ్లేయులతో కూడా నావికా యుద్ధాలు చేసాడు. దానికోసం నావికాసైన్యం తయారు చేసాడు. శివాజీకి అడుగడుగునా ప్రేరణ ఇచ్చింది తల్లి జిజియామాత మరియు గురువు సమర్ధరామదాసస్వామి.

శివాజీ బ్రతికి ఉండగా ఔరంగజేబు తనను జయించలేకపోయాడు. శివాజీ, కొడుకు శంభాజీ ఇద్దరూ పరమపదించారు. ఆ తరువాత దక్షిణాపథాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఔరంగజేబు యుద్ధానికి వచ్చాడు. దాదాపు 25 సంవత్సరాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాడు. శివాజీ పరమపదించిన తర్వాత కూడా హైందవి స్వరాజ్ లక్ష్యంగా, శివాజీ సైన్యం పోరాటం చేస్తూనే ఉన్నది. ఆ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమైనది. ఔరంగజేబును మహారాష్ట్ర లోనికి రానివ్వలేదు ఆ సమయంలో జరిగిన గెరిల్లా పోరాటంతో దెబ్బతిని ఔరంగజేబు వెన్నుచూపి పారిపోవాలని చూసాడు. కానీ అది కూడా అంత సులభం కాలేదు. చివరకు దారిలోనే చనిపోయాడు. అతని శవం కూడా ఆగ్రా వరకు కూడా తీసుకుపోలేకపోయారు. దారిలోనే సమాధి చేయవలసి వచ్చింది.

శివాజీ సామ్రాజ్యంలో ఎక్కడా మతకలహాలు జరగలేదు, మహిళలు అవమానించబడలేదు, మసీదులు, మతగ్రంథాలు అవమానించబడలేదు. శివాజీ సామ్రాజ్యంలో శిక్షలు కూడా కఠినంగా ఉండేవి. శివాజీ పరిపాలన ఇప్పటికీ అనుసరణీయం. దేశం ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలకు దిశా నిర్దేశము కూడా శివాజీ పరిపాలనా విధానమే.

## వంచినాథన్ అయ్యర్ (జన్మతిథి, జూన్ 17)

వంచినాథన్ అయ్యర్ ఒక నిర్భయ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మరియు పాలన పేరుతో వారు చేసిన దురాగతాలకు వ్యతిరేకంగా స్వతంత్ర భారత్ తిరుగుబాటుకు చిహ్నంగా తన జీవితాన్ని త్యాగం చేశారు. 25 సంవత్సరాల వయస్సులో, ఆయన రాబర్ట్ ఆషేను హత్య చేసి, ధైర్య మరణాన్ని స్వీకరించారు.



తమిళనాడుకు చెందిన ఆయన, జూన్ 17, 1886లో షెన్‌కోట్టై (అప్పటి ట్రావెన్‌కోర్ రాజ్యంలో భాగం)లో రఘుపతి అయ్యర్ మరియు రుక్మణి అమ్మాళ్ దంపతులకు శంకరన్ అయ్యర్‌గా జన్మించారు. ఆయన తన పాఠశాల విద్య మరియు ఉన్నత విద్యను షెన్‌కోట్టైలో పూర్తి చేశారు.

ట్రావెన్‌కోర్‌లో పనిచేస్తున్నప్పుడు, అతను వి.ఓ. చిదంబరం పిళ్లై, నీలకంఠ బ్రహ్మచారి, సుబ్రమణ్య శివ మరియు సుబ్రమణ్య భారతి వంటి అనేక మంది జాతీయవాదుల ప్రభావానికి లోనయ్యాడు. వారు అతనికి మార్గదర్శకులు.

1911 సంవత్సరంలో తిరునెల్వేల్లి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌గా రాబర్ట్ విలియం ఆషే పనిచేశారు. ఆయన పాలక బ్రిటిష్ వర్గానికి అనుకూలంగా ఉండే కార్యకలాపాలలో నిమగ్నమై, స్థానికుల ప్రయోజనాలను విస్మరించి, వారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించకుండా ఉండేవాడు. బలవంతపు మతమార్పిడి మిషనరీ కార్యకలాపాలను ప్రచారం చేశాడని కూడా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వి.ఓ. చిదంబరం పిళ్లై షిప్పింగ్ కంపెనీకి (టుటికోరిన్ మరియు కొలంబో మధ్య మొట్టమొదటి స్వదేశీ భారతీయ షిప్పింగ్ కంపెనీగా స్థాపించబడింది) వ్యతిరేకంగా పనిచేయడంలో కూడా ఆషే కీలక పాత్ర పోషించారు, ఇది దాని రద్దుకు దారితీసింది, తరువాత పిళ్లై అరెస్టుకు దారితీసింది.

జూన్ 11, 1917 న మానియాచి మెయిల్, ఆషే మరియు అతని భార్య మేరీ లిలియన్ ప్యాటర్సన్‌తో తిరునల్వేల్లి జంక్షన్ నుండి మానియాచికి బయలుదేరింది. వారు తమ నలుగురు పిల్లలతో కొడైకెనాల్‌కు వెళ్తున్నారు. ఉదయం 10:38 గంటలకు రైలు మానియాచిలో ఆగింది. సిలోన్ బోట్ మెయిల్ ఉదయం 10:48 గంటలకు చేరుకోవలసి ఉంది. ఆషెస్ బృందం ఫస్ట్ క్లాస్ క్యారేజ్‌లో ఎదురెదురుగా కూర్చుని, బోట్ మెయిల్ వచ్చే వరకు వేచి చూస్తుండగా, చక్కగా దుస్తులు ధరించి, జుట్టూ గడ్డంతో ఒక వ్యక్తి ఆషే బృందంలోకి ప్రవేశించి, బెల్జియం లో తయారు చేసిన బ్రౌనింగ్ పిస్టల్‌ను తీసి ఆషే ఛాతీపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చాడు. ఆ బుల్లెట్ ఆషేకు తగిలి, వెంటనే కుప్పకూలిపోయాడు. వాంచి ప్లాట్‌ఫారమ్ వెంట పరిగెత్తి దాక్కున్నాడు. కొంత సమయం తర్వాత అతను తన నోటిలోకి ట్రిగ్గర్ నొక్కి చనిపోయాడు. పిస్టల్ ఖాళీగా ఉన్నట్లు కనుగొనబడింది.

అతని జేబులో నుండి క్రింద పేర్కొన్న పదాలు ఉన్న ఒక లేఖ దొరికింది, "ఇంగ్లాండ్ మ్లేచ్ఛులు మన దేశాన్ని ఆక్రమించుకుని, హిందువుల సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టి నాశనం చేస్తున్నారు. ప్రతి భారతీయుడు ఆంగ్లేయులను తరిమికొట్టి, స్వరాజ్యం పొందడానికి మరియు సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నాడు. మన రామన్, శివాజీ, కృష్ణన్, గురు గోవిందన్, అర్జునన్ ధర్మాన్ని కాపాడుతూ మన భూమిని పాలించారు. ఈ భూమిలో మ్లేచ్ఛులు గోమాంసం తినే జార్జ్ V కి పట్టాభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జార్జ్ V మన దేశంలో అడుగుపెట్టిన వెంటనే అతన్ని చంపుతానని మూడు వేల మంది మద్రాసీలు ప్రతిజ్ఞ చేశారు. మన ఉద్దేశ్యాన్ని ఇతరులకు తెలియజేయడానికి, మా సహవాసంలో అతి తక్కువవాడిని అయిన నేను ఈ రోజు ఈ పని చేసాను. హిందూస్థాన్‌లోని ప్రతి ఒక్కరూ దీన్ని తన విధిగా భావించాలి. -ఇట్లు వాంచి అయ్యర్, షెంకోట్టా"
సనాతన ధర్మాన్ని నాశనం చేస్తున్న ఆంగ్లేయ మ్లేచ్ఛులను (ఆవు మాంసాన్ని తినే) తొలగించడమే ఈ హత్య వెనుక ఉద్దేశ్యమని ఆ లేఖ స్పష్టంగా సూచిస్తుంది.

వాంచి చేసిన ఈ ధైర్యవంతమైన మరియు నిస్వార్థ చర్య భారత స్వాతంత్ర్య ఉద్యమానికి అవసరమైన ఉత్తేజాన్నిచ్చింది. ఆ హత్య మరియు లేఖలోని విషయాలు తీవ్ర ఆందోళన మరియు అశాంతిని కలిగించాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో దక్షిణ భారత్‌లో హత్యకు గురైన మొదటి మరియు ఏకైక వలస బ్రిటిష్ అధికారి ఆషే. ఈ సంఘటనతో బ్రిటిష్ వారు దిగ్భ్రాంతికి గురయ్యారు మరియు ఉలిక్కిపడ్డారు.

మనియాచి రైల్వే స్టేషన్ తరువాత వాంచి మనియాచి స్టేషన్ గా పేరు మార్చబడింది. కానీ వాంచి ధైర్యసాహసాలను గుర్తించి, అతని ధైర్యసాహసాలకు ఇచ్చే అత్యున్నత గౌరవం ఇది కాదు. ఈ చిన్న చర్య కూడా ద్రావిడులు మరియు సువార్తికుల శరీరంలో ముల్లుగా మారడం తీవ్ర ఆగ్రహం కలిగించే విషయం.

## ముట్నూరి కృష్ణా రావు ( జన్మ తిథి, జూన్ 25)



ప్రసిద్ధ పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన శ్రీ ముట్నూరు కృష్ణారావు గారు కృష్ణా పత్రిక సంపాదకునిగా ఆంధ్రులకు చిరపరిచితులు. ఈయన 1907 నుండి 1945లో మరణించేవరకు అనగా నాలుగు దశాబ్దాల పాటు కృష్ణా పత్రిక సంపాదకునిగా తెలుగు సాహితీ వికాసానికి కృషిచేసిన మహనీయుడు. ఆ రోజుల్లో, చేతిలో కృష్ణాపత్రిక ఉండటం సాహితీ ప్రియులకొక అలంకారం.

శ్రీ కృష్ణారావు గారు జూన్ 25, 1879 లో కృష్ణా జిల్లా దివి తాలూకా ముట్నూరు గ్రామంలో జన్మించారు. పుట్టిన వెంటనే తల్లిని పోగొట్టుకున్నారు. మరి కొంతకాలానికి బాల్యంలోనే తండ్రిని కూడా పోగొట్టుకున్నారు. పినతండ్రి పంచన చేరి, ఆయన వద్ద పెరిగారు. ప్రాథమిక, ఉన్నత విద్య అంతా బందరులోనే గడిచింది. బందరులోని నోబుల్ కళాశాలలో ఎఫ్. ఏ కోర్సులో చేరారు. అక్కడ వీరికి ఉపాధ్యాయులుగా బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు ఉండేవారు. నాయుడి గారి ఉన్నత భావాలు, సంఘ సంస్కరణాభిలాష, దురాచారాల నిర్మూలన... మొదలైన భావాలు కృష్ణారావు గారిని విపరీతంగా ఆకట్టుకున్నాయి. నాయుడు గారితో వీరు కూడా బ్రహ్మ సమాజపు ఉపన్యాసాలకు వెళ్ళేవారు. అచిరకాలంలోనే మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. బందరులో విద్యాభ్యాసము తర్వాత, కృష్ణారావు గారు మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో బి. ఎ. లో చేరారు. అక్కడే ఈయనకు పట్టాభి సీతారామయ్య సహాధ్యాయిగా పరిచయమయ్యాడు. సాహితీ వ్యాసంగం ఎక్కువ అవటం చేత డిగ్రీని పొందకుండానే 1903 లో బందరుకు తిరిగి వచ్చారు.

మొదటి నుండీ రచనా వ్యాసంగం పట్ల ఉన్న ఉత్సాహంతో కృష్ణా పత్రికలో సహాయ సంపాదకునిగా చేరారు. 1907 లో ఆ పత్రికకు సంపాదకునిగా బాధ్యతలను తీసుకున్నారు. ఆ పత్రిక అతి కొద్దికాలంలోనే ఆనాటి మరొక ప్రముఖ పత్రిక అయిన ఆంధ్రపత్రికకు పోటీగా తయారయ్యింది. పోటీని తట్టుకోలేక ఆంధ్రపత్రిక నిర్వాహకుడు అయిన శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు కృష్ణారావు గారికి నెలకు 500 రూపాయల జీతాన్ని ఆశగా చూపి, తన పత్రిక వైపు ఆకర్షించుకోదలచారు. కానీ, కృష్ణారావు గారు ఆయన చూపిన ఆశలకు లొంగలేదు, కృష్ణాపత్రికలోనే కొనసాగారు. మరొకవైపు శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు కృష్ణాపత్రికను ఒక రాజకీయ పత్రికగా మార్చాలని విశేష ప్రయత్నాలు చేసారు. కానీ, కృష్ణారావు గారు కృష్ణాపత్రికను ఒక సాహిత్య పత్రికగా కొనసాగిస్తూ, మరణించే వరకూ ఆ పత్రికలోనే పనిచేసారు.

అలా తెలుగు భాషపట్ల, తెలుగు సాహిత్యంపట్ల ఆయన తన ప్రేమను చాటుకున్నారు. 1907 నుండి 1945 వరకు, అనగా 38 సంవత్సరాలు ఒక వ్యక్తి ఒక పత్రికకు సంపాదకునిగా పనిచేయటం నేటికీ ఒక రికార్డు. కొంతకాలం ఆంధ్ర భారతి అనే సాహిత్య పత్రికను కూడా నిర్వహించారు. కృష్ణా పత్రిక కార్యాలయంలో వీరి గోష్టిని సాహితీ వేత్తలు “దర్బారు” గా వ్యవహరించేవారట. కృష్ణా పత్రిక జాతీయోద్యమ కాలంలో చురుకుగా వ్యవహరించింది. ఈ పత్రిక సంపాదకత్వ బాధ్యతను శ్రీ ముట్నూరి ఒక తపస్సుగా పరిగణిస్తూ పత్రిక నడిపేవారని పత్రికారంగ ప్రముఖులు చెబుతుంటారు. కృష్ణాపత్రికలో వచ్చే వార్తలపై ప్రజలకు విపరీతమైన నమ్మకం ఉండేదట. ఎడిటర్ అనే ఇంగ్లిష్ పదానికి తెలుగు మాటగా ‘సంపాదకుడు’ స్థిరపడిపోయాడు. ‘సంచార విజ్ఞాన సర్వస్వ’మనిపించుకున్న కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ఈ మాటను తొలిసారి ప్రయోగించారంటారు. సంపాదకుడంటే, నిర్వచనంగానూ, నిదర్శనంగానూ కనిపిస్తారు, కృష్ణారావు గారు.

పత్రిక కార్యాలయంలోని జరిగే సమావేశాలకి అడివి బాపిరాజుగారు ‘కృష్ణరాయ దర్బారు’ అని నామకరణం చేసారు. ఈ సమావేశాల్లో కృష్ణారావుగారిని అందరూ గౌరవించేవారు. ఆ సమావేశాలకు కూడా ఆయనే సమన్వయకర్తగా వ్యవహరించేవాడు. ఆ దర్బారు – హేమాహేమీలయిన కాటూరి వెంకటేశ్వరరావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, పింగళి నాగేంద్రరావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, కొడాలి ఆంజనేయులు, పువ్వాడ శేషగిరిరావు, మునిమాణిక్యం నరసింహారావు, మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రి, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి గార్ల లాంటి వారితో నిజంగానే ‘భువన విజయం’ లాగా ఉండేది. పట్టాభి సీతారామయ్య, చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి, చిత్తూరు నాగయ్య తదితరులు అప్పుడప్పుడూ ఆ సభలలో పాల్గొనే వారు. పత్రికా సంపాదకునికి ఉండవలసిన వాడీ, వేడీ కృష్ణారావు గారి సొత్తు. ఈ లక్షణాలే ఆయనను ఒక ప్రముఖ సంపాదకునిగా తీర్చిదిద్దాయి.

‘సంపాదకుడంటే నా కింపారెడు భక్తి కలదు, సంపూర్ణ మనుజు డాతడు – చింపాంజీ కన్న నయము’ అని మహాకవి శ్రీశ్రీ, సంపాదకుడంటే ఒక పూర్ణ పురుషుడని తన బాణీలో చెప్పారు. సంపాదకులకు ఒక గౌరవాన్ని తెచ్చిపెట్టిన ఘనుడు శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు. వీరు మంచి హాస్యప్రియులు కూడా. ఒకరోజు కృష్ణారావు గారు ఒక సంపన్న గృహస్తు ఇంటికి అతిథిగా వెళ్ళారు. ఆ ఇంటి యజమాని పూజలో ఉన్నారు. పూజా కార్యక్రమాలు పూర్తి అయిన తరువాత, ఆయన బయటకు వచ్చి ఆ పూజా జలాన్ని ఎక్కువగా కృష్ణారావు గారి శిరస్సు మీద చల్లారు. దానికి కృష్ణారావు గారు, “ఆయన నా మీద తీర్థం ఎక్కువగా ఎందుకు అభిషేకించారో తెలుసా! నా తల ఆయనకు ఒక శివలింగంగా కనబడటం వలన” అని అన్నారు. అక్కడున్న మిగిలిన మిత్రులు కడుపుబ్బ నవ్వారు. కృష్ణారావు గారిది పూర్తిగా బట్టతల. అందుచేతనేమో! ఆయన ఎప్పుడూ తలపాగాతో ఉండేవారు.

ఒకసారి కృష్ణారావు గారికి అనారోగ్యం చేయటం వలన మిత్రులు ఆయనను వెంటనే ఒక హాస్పిటల్ లో చేర్చి, తరువాత వారి శ్రీమతికి కబురుపెట్టారట! ఆవిడ హాస్పిటల్ లో మంచం మీద ఉన్న కృష్ణారావు గారిని చూసి భోరున ఏడుపు లంకించుకుంది. అప్పుడు కృష్ణారావు గారు భార్యతో, “అప్పుడే రిహార్సల్ మొదలు పెట్టావా?” అని అన్నారట. అంత విషాదకర సన్నివేశాన్ని

కూడా వినోదంగా మార్చిన సరస సంభాషణా చతురుడు కృష్ణారావు గారు. అటువంటి మహనీయుడు 1945లో దేహయాత్ర చాలించారు. పత్రికల స్థాయి, ప్రమాణాలు తగ్గి, ప్రతి పత్రిక ఏదో ఒక రాజకీయ పార్టీకి కరపత్రంగా తయారయిన ఈ రోజుల్లో పత్రికా సంపాదకులు, సంపాదకులకు ఇంపారెడు గౌరవాన్ని తెచ్చిన కృష్ణారావు గారి నీతి , నిజాయితీలను ఆదర్శంగా తీసుకోవాలి. 'Journalism for sale' అని అప్రతిష్ఠ పాలైన పత్రికలు, శ్రీ కృష్ణారావు గారి నీతి, నిజాయితీలను ఆదర్శంగా తీసుకొని పత్రికల ప్రతిష్ఠను పునరుద్ధరించాలి!

## పూరీ జగన్నాథ రథయాత్ర (జూన్ 27)



శంఖువులు ప్రతిధ్వనించే ధ్వని, డప్పులు మరియు గంటల నవకాలీకరణ సంగీతాన్ని పెంచుతుంది, జపం వేగం విశ్వాసంతో క్రమంగా పెరుగుతుంది. దేవుడిని ఆలయం నుండి బయటకు తీసుకువస్తారు. శ్రీకృష్ణుని అవతారమైన జగన్నాథుడు, ఒరిస్సాలోని భువనేశ్వర్‌లోని బంగాళాఖాతం వెంబడి ఉన్న పూరీ ఆలయ పట్టణంలో నివసిస్తున్నాడు . ఒక ప్రసిద్ధ పురాణం ప్రకారం, జగన్నాథుడు తన సోదరుడు బలభద్రుడు మరియు సోదరి, దేవీ సుభద్రతో కలిసి తన జన్మస్థలమైన మధురను సంవత్సరానికి ఒకసారి రథంపై వెళ్ళి చూపించడానికి బయలుదేరడమే, ఈ రథయాత్ర.

పూరీలోని జగన్నాథ ఆలయం నుండి మధురలోని గుండిచి దేవి ఆలయం వరకు జరిగే ఈ ప్రయాణాన్ని పూరీ జగన్నాథ రథయాత్ర అంటారు. ప్రతి సంవత్సరం, హిందూ కాలమానం ప్రకారం ఆషాఢ మాసంలో (జూన్-జూలై) అమావాస్య రెండవ రోజున ముగ్గురు దేవతలను కొన్ని మైళ్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి రథాలపై తీసుకువెళతారు. భారతదేశంలో ఆలయం నుండి విగ్రహాన్ని బయటకు తీసుకెళ్ళే ఏకైక క్షేత్రం ఇదే కావచ్చు. 2025 సంవత్సరపు పూరీ రథయాత్ర జూన్ 27న ప్రారంభమై జూలై 5 వరకూ జరుపుకుంటారు. ఈ యాత్ర యొక్క ఒక ప్రాముఖ్యత ఏమిటంటే, అన్ని మతాలు మరియు విశ్వాసాల ప్రజలు దేవతలను చూడవచ్చు మరియు ఊరేగింపులో పాల్గొనవచ్చు. ఎందుకంటే ఇతర రోజులలో అన్య మతస్థులను ఆలయంలోకి అనుమతించరు. దీని కోసం, ప్రతి సంవత్సరం పూరీ రథయాత్రకు 4-5 లక్షల మంది యాత్రికులు వస్తారు. రథంలోని విగ్రహాలను చూడటానికి భారతీయులు మరియు విదేశీయులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. విగ్రహాలను చూసినవారికి రాబోయే సంవత్సరం సుసంపన్నంగా ఉంటుందని నమ్ముతారు.

పూరి రథయాత్రకు ముందు, మూడు విగ్రహాలకు ఆచారబద్ధంగా స్నానం చేయిస్తారు, ఆ తర్వాత ఊరేగింపు రోజు వరకు వాటిని ఒంటరిగా ఉంచుతారు, ఎందుకంటే స్నానం తర్వాత అవి కొద్దిగా రంగు మారుతాయి మరియు ఆ సమయానికి అనారోగ్యంగా పరిగణించబడతాయి. యాత్ర రోజున, ఒరిస్సా రాజకుటుంబానికి చెందిన పూరి రాజు ఆలయం నుండి విగ్రహాలను బయటకు తీసుకురావడానికి వేచి ఉండగా, ప్రజలు ఆలయం చుట్టూ జపిస్తూ, నృత్యం చేస్తూ ఉంటారు. జగన్నాథ ఆలయంపై పూర్తి అధికారం ఉన్న ఏకైక వ్యక్తి ఆయనే. ఆయన బంగారు పిడి వున్న చీపురుతో రథాన్ని ఊడ్చి, దేవతలకు తగినదని భావించి రథం నేలను పూలతో అలంకరిస్తారు. తరువాత ఆయన రథాల ముందు నేలను ఊడ్చి, చుట్టూ గంధపు నీటిని చల్లుతారు. ఇది చెరా పహారా అని పిలువబడే యాత్ర యొక్క ప్రసిద్ధ ఆచారం. ఈ ఆచారం భగవంతుని దృష్టిలో అందరూ సమానమని సూచిస్తుంది. రథాలలో విగ్రహాలను ఉంచడానికి రెండు గంటలు పడుతుంది.

ఈ మూడు రథాలను చెక్కతో తయారు చేసి, స్థానిక కళాకారులు అలంకరిస్తారు. జగన్నాథుని రథం 16 భారీ చక్రాలు మరియు 44 అడుగుల ఎత్తు కలిగి మూడింటిలో అతిపెద్దది. బలభద్రుని రథానికి 14 చక్రాలు మరియు 43 అడుగుల ఎత్తు ఉండగా, తరువాత సుభద్ర దేవి రథం 12 చక్రాలు మరియు 42 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. వీటిని 50 మీటర్ల పొడవైన తాళ్లతో మానవీయంగా లాగుతారు. రథాన్ని లాగడం వల్ల తమకు మంచి జరుగుతుందని మరియు తమ దోషాలకు ప్రాయశ్చిత్తం జరుగుతుందని ప్రజలు నమ్ముతారు కాబట్టి రథాలను లాగడానికి ప్రజలు పరుగెత్తుతారు. పూరి రథయాత్రలో, బలరాముని రథాన్ని మొదట లాగుతారు, తరువాత సుభద్ర దేవి రథాన్ని, చివరగా జగన్నాథుడున్న రథాన్ని లాగుతారు.

పూరి నుండి గుండిచా ఆలయానికి దూరం దాదాపు 3 కి.మీ. అయినప్పటికీ, జనసమూహం ఎక్కువగా ఉండటం వల్ల, రథయాత్ర చేరుకోవడానికి రెండు గంటలు పడుతుంది. చేరుకున్న తర్వాత, దేవతలు తొమ్మిది రోజుల పాటు ఆ ఆలయంలో ఉంటారు. అక్కడ యాత్రికులను దర్శనానికి అనుమతిస్తారు. తిరుగు ప్రయాణాన్ని బహుద యాత్ర అంటారు. తిరిగి వెళ్ళేటప్పుడు, ఊరేగింపు మౌసిమా ఆలయం (వారి అత్త నివాసం) వద్ద ఆగుతుంది, అక్కడ దేవతలకు పోడా పిఠా వడ్డిస్తారు. ఇది పేదవాడి ఆహారం అని చెప్పబడింది, ఇది జగన్నాథుడికి ఇష్టమైనది. పూరి రథయాత్ర భారతదేశంలో అత్యంత పురాతనమైన గొప్ప పండుగ. ఇది హిందూ పురాణాల నాటిది. స్కంద పురాణం, బ్రహ్మ పురాణం మరియు పద్మ పురాణాలలో ఈ రథయాత్ర గురించి ప్రస్తావించబడింది.

## పద్మాక్షి దేవాలయం, వరంగల్



కళ, వాస్తుశిల్పానికి ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజవంశం పాలనలో పద్మాక్షి ఆలయ కథ 12 వ శతాబ్దంలో ప్రారంభమవుతుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రదేశంలో మొదట ఒక శైవ గుహ ఆలయం ఉండేది. క్రీ.శ 1117 లో కాకతీయ అధిపతి రెండవ ప్రోల పాలనలో ఒక జైన మందిరం చేర్చబడింది. ఈ ప్రభావాల సమ్మేళనం ఆలయం యొక్క ప్రత్యేక లక్షణానికి దోహదం చేస్తుంది. ఆలయ నిర్మాణం ప్రాంతీయ సాంస్కృతిక మరియు ఆర్థిక శ్రేయస్సు కాలంతో నిబిడీకృతమై ఉంది కనుక, ఇది రాజవంశం యొక్క అభివృద్ధి చెందిన పాలనను ప్రతిబింబిస్తుంది.

శతాబ్దాలుగా, పద్మాక్షి ఆలయం గణనీయమైన చారిత్రక సంఘటనలకు సాక్ష్యంగా నిలిచింది. ప్రారంభంలో పద్మావతి దేవికి అంకితం చేయబడిన జైన దేవాలయాన్ని పోలిఉన్న ఈ ఆలయం కాలక్రమేణా అభివృద్ధి చెందింది. ఇది కాకతీయుల కాలం యొక్క సామాజిక, సాంస్కృతిక నిర్మాణంతో పెనవేసుకుపోయింది. పద్మాక్షి దేవి చుట్టూ ఉన్న ఇతిహాసాలు మరియు జానపద కథలు ఆలయం యొక్క చారిత్రక ఆకర్షణను మరింత పెంచుతాయి, ఆలయం పట్ల ఆసక్తి మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను జోడిస్తాయి.

స్థానిక సంప్రదాయాలతో లోతుగా ముడిపడి ఉన్న పద్మాక్షి ఆలయం సాంస్కృతిక కార్యకలాపాలు, మతపరమైన వేడుకలు మరియు సామాజిక సమావేశాలకు శక్తివంతమైన కేంద్రంగా ఉంది. ఈ ఆలయం స్థానిక సమాజం యొక్క జీవితాలలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ ప్రాంతం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించే వివిధ పండుగలు మరియు ఆచారాలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ అనుసంధానం సమాజంలో ఆలయ ప్రాముఖ్యతను మరింతగా పెంచినది.

ప్రధానంగా రాతితో నిర్మించిన ఈ ఆలయంలో కాకతీయుల కాలంలో ఉన్న ద్రావిడ నిర్మాణ శైలిని ప్రతిబింబించే సంక్లిష్టమైన శిల్పాలు ఉన్నాయి. ఈ శైలి విస్తృతమైన అలంకరణ మరియు వైభవానికి ప్రసిద్ధి చెందింది. ఇవి ఆలయ ప్రాంగణం అంతటా అందంగా ప్రదర్శించబడతాయి. ఈ ఆలయం యొక్క రూపకల్పన జైన మరియు హిందూ నిర్మాణ అంశాల కలయికను కలిగి ఉంది. ఇది దానిని తీర్చిదిద్దిన చారిత్రక ప్రభావాలను ప్రతిబింబిస్తుంది.

ఆలయ నిర్మాణశైలిలో సాంప్రదాయకంగా దేవత నివసించే గర్భగుడి, సమావేశాలు మరియు ఆచారాల కోసం మండపం ఉన్నాయి. ఆలయ గోడలకు అలంకరించి, పౌరాణిక కథలను వర్ణిస్తూ నిర్మితమైన శిల్పసంపద ఆలయ కళాత్మకతను ఇనుమడింపజేస్తాయి. దేవతలు మరియు ఆకృతుల కళాత్మక ప్రాతినిధ్యం, వాటిని సృష్టించిన కళాకారుల నైపుణ్యం మరియు భక్తిని ప్రదర్శిస్తుంది.

ఆలయం యొక్క చారిత్రక మరియు నిర్మాణ ప్రాముఖ్యతను గుర్తించి, దాని ప్రత్యేక లక్షణాలను పునరుద్ధరించడం మరియు సంరక్షించడంపై అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు ఆలయ సౌందర్యాన్ని, కళానైపుణ్యాన్ని భవిష్యత్ తరాలు ఆస్వాదించేలా చేస్తాయి. ఆలయ చారిత్రక, కళాత్మక విలువను గౌరవిస్తూ ఆలయ నిర్మాణ సమగ్రతను కాపాడటమే ఈ పరిరక్షణ ప్రయత్నాల లక్ష్యం.

పద్మాక్షి ఆలయం, తెలంగాణలో ఒక ప్రధాన పుణ్యక్షేత్రంగా ఉంది. ఆచారాలు, వేడుకలు మరియు ప్రత్యేక పూజలు చేయడానికి వచ్చే భక్తులను ఆలయం ఆకర్షిస్తుంది. ఈ ఆలయం స్థానిక కళలు, సంస్కృతి మరియు సంప్రదాయాలను గాఢంగా ప్రభావితం చేసింది. దీని ప్రాముఖ్యత మత ఆచారాలకు అతీతంగా విస్తరించి, వివిధ నేపథ్యాల నుండి వచ్చిన ప్రజలను ఏకం చేసే సాంస్కృతిక మైలురాయిగా పనిచేస్తుంది.

ఈ ఆలయం హన్మకొండలో పర్యాటకానికి గణనీయంగా దోహదం చేసింది. దీని చరిత్ర మరియు వాస్తుశిల్పాన్ని అన్వేషించడానికి ఆసక్తి చూపే సందర్శకులను ఆకర్షిస్తుంది. ఇంకా, పద్మాక్షి ఆలయం ఒక విద్యా వనరుగా పనిచేస్తుంది. చరిత్ర, కళ మరియు వాస్తుశిల్పంపై అంతర్దృష్టిని అందిస్తుంది. ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వం, కాకతీయ వంశం కృషి గురించి తెలుసుకోవడానికి ఇది ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తుంది.

## చంపక్కులం పడవల పోటీ పండుగ

## (వర్ష ఋతువు ఆరంభంలో)

అలప్పుజ జిల్లాలోని చంపక్కులం అనే సుందరమైన గ్రామంలో జరిగే చంపక్కులం పడవల పందాలు కేరళలోని అత్యంత ప్రసిద్ధ మరియు పురాతన పాము పడవల పందేలలో ఒకటి. సాధారణంగా జూన్ లేదా జూలైలో జరిగే ఈ వార్షిక కార్యక్రమం రాష్ట్రంలో పడవల పందేల ప్రారంభాన్ని సూచిస్తుంది. పంపానది ఈ ఉల్లాసకరమైన పందేలకు సరైన వేదికను అందిస్తుంది, అద్భుతమైన పోటీని చూడటానికి భారీ సంఖ్యలో జనాన్ని ఆకర్షిస్తుంది.



చంపక్కులం పడవల పందేల చరిత్ర ఈ ప్రాంత సాంస్కృతిక మరియు మతపరమైన సంప్రదాయాలతో లోతుగా ముడిపడి ఉంది. ఈ పందేలు అంబలప్పుజలోని శ్రీ కృష్ణ స్వామి ఆలయంలో శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినందుకు గుర్తుగా నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం, ఆలయంలో ప్రతిష్ఠించిన అసలు విగ్రహం అపవిత్రంగా ఉందని తేలింది. దీనితో అప్పటి చెంబకస్సేరి రాజు ప్రత్యామ్నాయాన్ని కనుగొనవలసి వచ్చింది. కురిచి కరిక్కులం పార్థసారథి ఆలయంలో తగిన విగ్రహాన్ని గుర్తించారు. కురిచి వలియమదోం కుటుంబం అనుమతితో, విగ్రహాన్ని అంబలప్పుజకు తీసుకువచ్చారు. ఈ ప్రయాణంలో, మంత్రి మరియు అతని బృందం దొంగలను నివారించడానికి చంపక్కుళంలోని మాప్పిలస్సేరి ఇట్టి థామెన్ ఇంట్లో రాత్రికి ఆగారు. మరుసటి రోజు, రాజు కూడా వారితో చేరడంతో, ఆ విగ్రహాన్ని దాని కొత్త ఇంటికి తీసుకెళ్లే గొప్ప ఊరేగింపు జరిగింది.

ఈ చారిత్రాత్మక ఊరేగింపును గౌరవించడానికి ఏటా పడవ పందేలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం, అంబలప్పుళ నుండి ఒక బృందం అంబలప్పుళ ఆలయానికి ప్రత్యేకమైన తీపి వంటకం పాల్పాయసంతో మాప్పిలస్సేరి కుటుంబాన్ని సందర్శిస్తుంది. ప్రార్థనలు మరియు ఆచారాల తర్వాత, రేసు ప్రారంభమవుతుంది, ఇది మొత్తం గ్రామాన్ని ముంచెత్తే పండుగ వాతావరణాన్ని సృష్టిస్తుంది.

చంపక్కుళం పడవ పందేలలో అద్భుతమైన చుండన్ వల్లంలు లేదా పాము పడవలు ఉంటాయి, ఇవి పొడవైన, ఇరుకైన మరియు సొగసైనవిగా తయారు చేయబడిన ఓడలు. ఇవి నీటిలో నడపడానికి జట్టుగా నావికుల కృషి మరియు సమకాలీకరణ అవసరం. ఈ రేసు కేవలం ఒక పోటీ మాత్రమే కాదు, కేరళ యొక్క గొప్ప సముద్ర వారసత్వాన్ని గౌరవించే వేడుక. పురాతన పడవ పాటల లయకు అనుగుణంగా ఈ భారీ పడవలు నీటిలోకి దూసుకెళ్లే దృశ్యం ఒక ఉత్కంఠభరితమైన అనుభవం, ఇది ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది.

పడవల పందేల ఉత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మరియు సాంప్రదాయ ప్రదర్శనలు ఉంటాయి. ఇవి పండుగ ఉత్సాహాన్ని పెంచుతాయి. రంగురంగుల అలంకరణలు, సంగీతం మరియు నృత్యాలతో ఈ ప్రాంతం మొత్తం ఒక క్రొత్త జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఆనందం మరియు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టిస్తుంది. చంపక్కుళం పడవల పందేలు స్థానిక సమాజానికి కూడా ఒక ముఖ్యమైన కార్యక్రమం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సందర్శకులకు వారి సంప్రదాయాలు మరియు ఆతిథ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశాన్ని అందిస్తుంది.

చంపక్కుళం పడవల పందేలు అనేక సంవత్సరాలుగా గణనీయంగా సందర్శకుల దృష్టిని ఆకర్షించింది. 1927లో, అప్పటి ట్రావెన్‌కోర్ దివాన్, ఎం.ఇ. వాట్స్, ఈ రేసును ప్రారంభించారు. 1952లో, ట్రావెన్‌కోర్ చివరి రాజు శ్రీ చిత్ర తిరునాల్ బల రామ వర్మ ఈ రేసును వీక్షించి, మొదటి బహుమతి విజేతలకు 'రాజ్‌ప్రముఖన్ ట్రోఫీ'ని స్థాపించారు. ఈ కార్యక్రమానికి ఒక క్రొత్త ప్రతిష్టను జోడించారు.

ఈ రేసు మలయాళ నెల మిథునంలో మూలం రోజున జరుగుతుంది, ఇది జూన్ లేదా జూలై నెలలకు అనుగుణంగా ఉంటుంది. ఈ కార్యక్రమం ఆచారాలు మరియు వేడుకలతో ప్రారంభమవుతుంది, తరువాత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పడవల పందెం జరుగుతుంది. రాష్ట్ర సాంస్కృతిక నిర్మాణంలో అంతర్భాగమైన ఈ గొప్ప దృశ్యాన్ని చూడటానికి కేరళ మరియు వెలుపల నుండి ప్రేక్షకులు చంపక్కుళంకు వస్తారు.

## దక్షిణాపథ గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు:

దక్షిణాపథ స్టడీ సర్కిల్ వారు సికిందరాబాద్ లోని కార్ఖానాలో గల తమ కార్యాలయములో ఈ నెల 26 వ తేదీన శ్రీ విద్యారణ్యులవారి జయంతోత్సవమును నిర్వహించినారు.

కార్యక్రమంలో ముందుగా, దక్షిణాపథస్టడీ సర్కిల్ తెలంగాణ ప్రాంత సంయోజకులు శ్రీ కళ్యాణ్ చక్రవర్తి గారు తమ సంస్థ ఆశయాలూ, చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి సభికులకు వివరించారు.

పిమ్మట కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన జాతీయపరిషత్తు సభ్యులూ, ధర్మప్రచారకులూ అయిన శ్రీ కుదుములకుంట రవీంద్రనాథ్ గారు, సంవిత్ ప్రకాశన్ డైరెక్టర్ శ్రీమతి శైలజ గారూ జ్యోతి ప్రజ్వలన కావించడంతో సభ ప్రారంభమైనది.

శ్రీమతి శైలజ గారు తమ అధ్యక్షోపన్యాసంలో దక్షిణాపథ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న చారిత్రక పరిశోధనలూ, దీనికై వివిధ విశ్వవిద్యాలయాలతో అనుసంధానమైన తీరూ వివరించారు. దక్షిణాపథ సంస్థ మన సంస్కృతికి చెందిన అనేకమంది మహనీయుల జయంతోత్సవాలను, చారిత్రక దినోత్సవాలనూ నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీ విద్యారణ్యులవారి జయంతోత్సవాన్ని జరుపుకుంటున్నామనీ తెలిపారు.

అనంతరం, ముఖ్యవక్తగా విచ్చేసిన శ్రీ రవీంద్రనాథ్ గారు పదకొండవ శతాబ్దంలో భారతదేశ ఉత్తర భాగంపైన దాడులు, దండయాత్రలూ సలిపిన ముస్లిం దూరాక్రమణదారులు క్రమంగా 14 వ శతాబ్దం వచ్చేసరికి దేశ దక్షిణ ప్రాంతంవైపు తమ దుష్టచూపులను మరల్చారనీ, అంతవరకూ ఎంతో సుభిక్షంగా, సాంస్కృతికంగా పటిష్టంగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా అతలాకుతలమై పోయిందనీ తెలిపారు.

హైందవ సంస్కృతిపై అటువంటి దామనకాండ జరుగుతున్న సమయంలో నేటి వరంగల్ ప్రాంతంలో ఒక సామాన్య సంప్రదాయ కుటుంబంలో జన్మించిన మాధవాచార్యుడనే కుర్రవాడు దైవానుగ్రహంతో శృంగేరీ పీఠాధిపతుల చెంత చేరడం, వారు ఆ కుర్రవాడికి దీక్షాధారణ చేయించడం, ఆ పిమ్మట పరివ్రాజకుడై, ఆ యువకుడు కాశీ చేరడం, అక్కడ స్వయంగా శ్రీ వేదవ్యాసులవారే అతనికి సన్యాస దీక్ష ఇప్పించి విద్యారణ్యుడిగా కరుణించడం వెనుక బలీయమైన దైవ నిర్ణయం ఉందని తెలిపారు. విద్యారణ్యులు అపార జ్ఞాన సముపార్జన చేసి అనేక గ్రంథాలూ, భాష్యాలూ రాసినారని, కాలక్రమంలో శృంగేరీ పీఠాన్ని అధిరోహించడం జరిగిందనీ చెప్పారు. శృంగేరీ పీఠాధిపతులుగా వారు, నాడు జరుగుతున్న ముస్లిం దండయాత్రలూ, దూరాగతాలకు కలత చెంది, హిందూ ధర్మ పునః ప్రతిష్టకై కంకణ బద్ధులైనారు. అదే సమయంలో మహమ్మద్ బిన్ తుగ్లక్ వద్ద ఇస్లాం లోకి మతాంతరీకరణ చేయబడిన ఇరువురు వీరులు, హరిహర రాయలు బుక్కరాయలు అను వారిని చేరదీసి, వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చి, హంపీ నగర కేంద్రంగా విజయనగర రాజ్యాన్ని నిర్మింపచేశారు.

కాలక్రమంలో ఈ విజయనగర రాజ్యమే ఒక మహాసామ్రాజ్యమై, హిందూ మత పునర్వైభవాన్ని నాలుదిక్కులా చాటిచెప్పిందని శ్రీ రవీంద్రనాథ్ గారు తెలిపారు. ఈ విధంగా దక్షిణ భారతదేశంలో మహమ్మదీయుల దండయాత్రలను నిలువరించి, హిందూ మహాసామ్రాజ్య స్థాపనలో శ్రీ విద్యారణ్యులు తమ తపోశక్తినంతా ధారపోసారని తెలిపారు. శ్రీ విద్యారణ్యులవారు రచించిన అనేక గ్రంథాలూ, సృష్టించిన వాఙ్మయ సంపదనూ వివరించిన శ్రీ రవీంద్రనాథ్ గారు, వాటిలోని కొన్ని శ్లోకాలను ధారాళంగా చదవడం సభికులను మంత్రముగ్ధులను చేసింది.

ఆద్యంతం ఎంతో ఉద్వేగభరితంగా సాగిన శ్రీ విద్యారణ్యుల వారి జయంతోత్సవ సభ శ్రీ కళ్యాణ్ చక్రవర్తిగారి వందన సమర్పణతో ముగిసింది. అనంతరం సభికులకు ప్రసాద వితరణ చేయడమైనది.

## ఈ నెలలో ముఖ్యమైన రోజులు:

నిర్జల ఏకాదశి, జూన్ 6
మృగశిర కార్తె, జూన్ 7
ఏరువాక పూర్ణిమ, జూన్ 10
అంతర్జాతీయ యోగా దినోత్సవం, జూన్ 21
యోగినీ ఏకాదశి, జూన్ 22
తెలంగాణా బోనాల పండుగ ప్రారంభం, జూన్ 29

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925

